ప్రజాశక్తి
మంగళవారం 28 ఫిబ్రవరి 2023 5 అనంతపురం



నేడు రైతుభరోసా సాయం అందజేత

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్సాఆర్ రైతుభరోసా -పీఎం కిసాన్, మాండూస్ తుపాన్ ప్రభావం వల్ల నష్టం పోయిన రైతులకు మంగళవారం నాడు వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రనాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10.30 గంటలకు అనంతపురం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమం జరగనుందన్నారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ రైతు భరోసా -పీఎం కిసాన్ కింద 2,83,229 మంది రైతులకు రూ.59.11 కోట్లు, మాండూస్ తుపాన్ వల్ల నష్టం పోయిన 241 మంది రైతులకు రూ.26.70 లక్షల రూపాయలు విడుదల చేయనున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.



హిందూపురం సిటిఒ కార్యాలయం

పురం సిటిఒ కార్యాలయంలో


ఎసిబి దాడులు

◆రూ.30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు

◆అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంపై సోమవారం సాయంత్రం ఎసిబి అధికారులు దాడి చేశారు. ఓ ఎగ్జిబిషన్ నిర్వాహకుని నుంచి లంచం తీసుకుంటూ ఉండగా అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములతో పాటు సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, అటెండర్ జ్యోతిరావు, క్లర్క్ శేఖర్‌లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ పరిగి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వి.నాగేష్ బిందు ట్రేడ్ ఎగ్జిబిషన్ నడుపుతున్నాడు. హిందూపురం పట్టణంలోని నానేప్పనగర్‌లో గోడౌన్ ఏర్పాటు చేసుకుని అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పలు పట్టణాల్లో ఎగ్జిబిషన్ నడుతున్నాడు. ఇతను జిఎస్‌టి నెంబరు సైతం తీసుకుని టర్నోవర్ జరిగిన రూ.2లక్షలకు రూ.36వేలు పన్ను సైతం ఇటీవల చెల్లించాడు. కాగ రాజశేఖర్ టర్నోవర్ ఎక్కువ జరిగిందని దాడులు నిర్వహించి, జరిమానాలు విధిస్తే ఎక్కువ మొత్తంలో విధించాల్సి ఉంటుందని సిటిఒ అధికారులు అతన్ని బెదిరించారు. ఇలా జరక్కుండా ఉండాలంటే రూ.50వేలు లంచాన్ని డిమాండ్ చేశారు. ఇంత తాను ఇవ్వలేనని రూ.30 వేలు ఇవ్వడానికి బేరం కుదుర్చుకున్నాడు. ఇదే విషయాన్ని బాధితుడు నగేష్ ఎసిబి అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎసిబి అధికారుల సూచన మేరకు నాగేష్ సోమవారం సాయంత్రం రూ.30 వల నగదును తీసుకుని సిటిఒ కార్యాలయానికి వెళ్లాడు. నగదును సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌కు ఇచ్చాడు. వెంటనే రాజశేఖర్ దీనిని క్లర్క్ శేఖర్‌కు రూ.25వేలు, అటెండర్ జ్యోతిరావుకు రూ.5 వేలు ఇచ్చాడు. అప్పటికే అక్కడ కాపుకాచిన ఎసిబి అధికారులు దాడులు చేసి లంచం తీసుకున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ అవినీతి బాగోతంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములు ఉన్నాడని తేలడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించామని ఎసిబి డీఎస్పీ తెలిపారు.



బరిలో నిలిచే వారి..., లెక్క తేలింది..!

బరిలో అభ్యర్థులు
పట్టభద్రులు : 49
ఉపాధ్యాయ స్థానం : 12

ఉపసంహరణలు
పట్టభద్రులు : 02
ఉపాధ్యాయ స్థానం : 02

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికల పోరులో మలిఘట్టం పూర్తయ్యింది. ఉపసంహరణలు పూర్తవడంతో బరిలో నిలిచేదెవరన్నది స్పష్టమైంది. పట్టభద్రుల నియోజకవర్గానికి 49 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది బరిలో నిలువనున్నారు. నామినేషన్ల దాఖలు స్క్రూటనీ తరువాత 51 మంది అభ్యర్థులు పట్టభద్రుల నియోజకవర్గానికి, 14 మంది ఉపాధ్యాయ నియోజకవర్గానికి అభ్యర్థులు పోటీలో ఉండేవారు. ఉపసంహరణల సమయంలో వీరిలో పట్టభద్రులకు ఇద్దరు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఇద్దరు నామినేషన్ పత్రలను సోమవారం నాడు ఉపసంహరించుకున్నారు. దీంతో పట్టభద్రుల నియోజకవర్గానికి 49 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది బరిలో నిలిచారు. టిడిపి అభ్యర్థి బి.రామగోపాల్‌రెడ్డి భార్య భూమిరెడ్డి ఉమాదేవి, వెన్నపూస వెంకట మహేశ్వరరెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఉపసంహరించుకున్న వారిలోనున్నారు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గానికి వస్తే స్వతంత్ర అభ్యర్థులు చింతకుంట రమేష్, ఎంవి.శ్రీదేవిలు ఉపసంహరించుకున్నారు.

నేటి నుంచి ప్రచార హోరు మొదలు

మండలి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తేలిపోవడంతో ఇక నుంచి ప్రచారహోరు కొనసాగనుంది. ఇప్పటికే ఆయా అభ్యర్థులు ఓటర్లను కలుసుకునే పనిని చేపట్టారు. పశ్చిమ రాయలసీమ స్థానంలో పాత జిల్లాలు మూడయితే కొత్తవి ఆరు జిల్లాలు ఉన్నాయి. ఈ ఆరు జిల్లాల్లోనూ అభ్యర్థులు ప్రచారాలు కొనసాగించనున్నారు. ఇప్పటికే అధికార వైసిపి అభ్యర్థులకు మద్దతుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంతపురం నగరం విచ్చేశారు. జిల్లాలోని ముఖ్య నేలతందరితోనూ ప్రత్యేకంగ సమావేశాలు నిర్వహిస్తున్నారు. వైసిపి అభ్యర్థుల విజయానికి కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిల విజయానికి ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులతోపాటు, ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. టిడిపి నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జులు అభ్యర్థుల తరుపున ప్రచారం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మార్చి 11వ తేది సాయంత్రం నాలుగు గంటల వరకు అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు అవకాశముంది.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎస్.మంగమ్మ ఏకగ్రీవం



ఎస్.మంగమ్మ



ఎమ్మెల్సీ డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న ఎస్.మంగమ్మ

స్థానిక సంస్థల మండలి ఎన్నికలకు జరిగిన నామినేషన్లలో ఒక్క నామినేషన్ మాత్రమే ఆమోదం పొందింది. ఈ స్థానానికి జరిగిన నామినేషన్ ప్రక్రియలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో వేలూరి రంగయ్యకు సంబంధించిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. అధికార వైసిపికి చెందిన మంగమ్మ ఒక్క నామినేషన్ మాత్రమే ఆమోదం పొందింది. ఉపసంహరణలు కూడా పూర్తయిన నేపథ్యంలో స్థానిక సంస్థల మండలి ఎన్నికలకు సంబంధించి మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ ప్రకటించారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం ఆమెకు డిక్లరేషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉషచరణ్ శ్రీ, మాజీ మంత్రి ఎం.శంకర నారాయణ, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాం

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్



పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యిందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్సు హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 13న జరిగే ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నట్టు తెలిపారు. పిఒలు, ఎపిఒలు, ఇతర పోలింగు సిబ్బంది అందరికీ రెండు విడతల్లో ఎన్నికల నిర్వహణపైన శిక్షణ ఇస్తామన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో అభ్యర్థులు ప్రచారాలు చేసుకోవచ్చునని తెలిపారు. పేర్ల వివరాల వారీగా బ్యాలెట్ పేపరును ఎన్నికల సంఘం రూపొందించి పంపుతుందన్నారు. ఓట్లకు కూడా ఈ ఎన్నికల్లో ఓటింగ్ ఎలా చేయాలన్న దానిపైనా మండల, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్టు వివరించారు. ఎన్నికల్లో అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. వారికి అవసరమైన సహకారాన్ని , సూచనలను అందించేందుకు జిల్లా కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అభ్యర్థుల వ్యయంపైనా పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేపడుతున్నట్టు వివరించారు.



విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు, సిపిఎంనాయకులు

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి

విద్యుత్ శాఖ కార్యాలయం ముందు రైతుల ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతుల పంట పొలాలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని మన్నీల గ్రామ రైతులు కోరారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ డిఇ కార్యాలయం వద్ద రైతులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాప్తాడు సిపిఎం మండల కమిటీ నాయకులు రామాంజినేయులు మాట్లాడుతూ బోరు బావులకు విద్యుత్ సరఫరా సక్రమంగా చేయడం లేదన్నారు. ముఖ్యంగా వేళాపాలా లేని కోతలు విధిస్తున్నారని వాపోయారు. 10 రోజులుగా విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయన్నారు. దీంతో పంటలకు నీటితడులు లేక ఎండిపోతున్నాయని వాపోయారు. పంట చేతికి వస్తున్న దానిమ్మ, చీని, ద్రాక్ష, అరటి, వేరుశనగ తదితర పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. నీటి తడులు అందించకపోతే చెట్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. మన్నీల గ్రామంలో విద్యుత్ లైన్లు నాసిరకంగా ఉండటం వల్ల ఎప్పుడు, ఎక్కడ ఏ లైను తెగిపోతుందో రైతులు భయంతో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ వైర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి త్రిలోక్‌నాయుడు, గ్రామ పెద్దలు రామాంజి, ఆంజనేయులు, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం పట్టణంలోని శ్రీ కృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ గురించి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ రవిశంకర్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనేది పెను భూతం లాంటిదని, చట్ట రీత్యా నేరమన్నారు. ర్యాగింగ్‌కి పాల్పడితే తల్లిదండ్రులకి సమాచారం అందించి, కళాశాల నుండి బహిష్కరిస్తామన్నారు. జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ కూడా ఉందన్నారు. దీనికి సమన్వయ కర్తగా డాక్టర్ పూర్ణిమను నియమించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహ భావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.నారాయణరెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాయదుర్గం నుంచి విజయవాడకు పాదయాత్రను చేపట్టారు. ముందుగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వైసిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ జానకిరాముడు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. దీన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రెండో విడత పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బండారు కదరప్ప, సాకే గురుమూర్తి, కళ్యాణదుర్గం నియోజకవర్గ నాయకులు, రామన్న, వాసు, గురుమూర్తి, రాయదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వన్నూరుస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

బొమ్మనహాల్ : మండలంలోని కలగాలనిల్లి గ్రామానికి చెందిన హరిజన హేమావతి (40) సోమవారం వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, భర్త తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు.. హేమావతి ఉదయం పత్తి కలుపు తీయడానికి పొలానికి వెళ్లింది. ఈనేపథ్యంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పొలంలో అకస్మాత్తుగా కింద పడిపోయింది. దీంతో బంధువులు హుటాహుటిన ఉద్దేహాల్‌లో ఆర్ఎంపి వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 108 ద్వారా బళ్లారికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. హేమావతి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యా సంవత్సరం ఇంకా ముగియక మునుపే 2023-24 విద్యా సంవత్సరానికి అప్పుడే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్ ప్రయివేట్ విద్యాసంస్థలు, కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్రప్రసాద్, ఐసా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలం డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ అధికారి సాయిరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడి పెరిగిపోయిందన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లి తండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ముందస్తు అడ్మిషన్ల పేర్లతో విద్యావ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే అలాంటి సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర అధ్యక్షులు బండారు శంకర్, ఐసా జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రతిభ భారతి పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికలు నిర్వహిద్దాం

◆ పకడ్బందీగా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలి

◆ ఎలక్షన్ కమిషన్ నిబంధనల అమలు తప్పనిసరి

◆ సమీక్ష సమావేశంలో ఎన్నికల పరిశీలకులు



ఎన్నికల నోడల్ అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు డా॥పోలా భాస్కర్, ఎం.హరి జవహర్ లాల్‌లు సూచించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో అధికారులు భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమ నిబంధనల మేరకే పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో చేపట్టే పనులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ నిర్వహించే పీవోలు ,ఏపీవోలు, ఎన్నికల సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన సమస్యలు ఉంటాయని, వాటిని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా అంతటా శాంతి భద్రతలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. నిర్దేశిత సమయంలో ఎన్నికల సామగ్రిని ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌కు సంబంధించి అభ్యర్థుల పేర్లలో అక్షర దోషాలు లేకుండా ప్రింట్ చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ చాలా సున్నితమైన అంశమని, అందులో అభ్యర్థుల పేర్లు, సంబంధించిన ఫొటోలు ఒకేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నెట్ సమస్య లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎన్నికల పరిశీలకులకు తెలిపారు. జిల్లాలో పట్టభద్రుల నియోజక వర్గాలకు 84 పోలింగ్ స్టేషన్లు, టీచర్ల నియోజకవర్గాలకు 33 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 579 మంది పోలింగ్ సిబ్బందిని కూడా నియమించామని, వారికి శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. ఎస్పీ కె.ఫక్కీరప్ప మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలకు శాంతి భద్రతల దష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 33 రూట్లలో మొబైల్ పార్టీలను, 54 లొకేషన్స్‌లలో ఫ్లయింగ్ టీమ్లను ఏర్పాటు చేశామన్నారు. 27 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, 20 పికెట్స్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రీ దేవి, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, అనంతపురం, కళ్యాణదుర్గం గుంతకల్ ఆర్డీవోలు మధుసూదన్, ఏ.నిశాంత్‌రెడ్డి, రవీంద్రతో పాటు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

గుడినాడు కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న గడినాడు కన్నడిగులకు కర్ణాటక రాష్ట్రంలో విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కన్నడిగులు కోరారు. ఈమేరకు అనంతపురం జిల్లాలోని డి.హారేహాల్, కర్నూలు జిల్లాలోని ఆదోని, ఆలూరు ప్రాంతాలకు చెందిన కన్నడ భాష మాట్లాడే వారు సంయుక్తంగా బళ్లారి నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ పవన్‌కుమార్ మాల్పాటికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న కన్నడిగులకు గడినాడు రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. ముఖ్యంగా 1 నుంచి 10వ తరగతి వరకు కన్నడ మీడియం చదివిన గడినాడు విద్యార్థులకు ఇంటర్, పియుసి చదివేందుకు ఆంధ్రప్రదేశ్‌లోకన్నడ మీడియం కళాశాలలు లేకపోవడంతో కర్ణాటక రాష్ట్రంలో చదవడానికి వెళ్లే అక్కడ గడినాడు రిజర్వేషన్లు వర్తించవని చెబుతున్నారన్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. కావున గుడినాడు కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా గిరిజన సమాఖ్య రాయదుర్గం తాలూకా అధ్యక్షులు కృష్ణానాయక్, కన్నడ రక్షణ వేదిక బళ్లారి జిల్లా అధ్యక్షులు ఛానల్ శేఖర్, గడినాడు సాంస్కృతిక సంఘం, డి.హీరేహాల్ శాఖ, అనంతపురం జిల్లా కన్నడ శిక్షకుల సంఘం ప్రతినిధులు, కర్నూలు జిల్లా గడినాడు కన్నడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



బళ్లారి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గుడినాడు కన్నడిగులు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అనంత రాముడు

'అనంతలక్ష్మి'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతలక్ష్మి కళాశాల వార్షికోత్సవం, కళాశాల ఛైర్మన్ అనంతరాముడు పుట్టిన రోజును పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బత్తలపల్లి ఆర్డీటీ వారి సహకారంతో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ అనంత రాముడు మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఆసుపత్రి, రక్తనిధి కేంద్రం సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ మూర్తి రావు ఖోకలే, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఖలీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం పంపిణీ

గుత్తి : పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో మృతుడి కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి సోమవారం పంపిణీ చేశారు. కాలనీకి చెందిన షేక్ ఖాజా ఈనెల 20వ తేదీన మరణించాడు. ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరు చేసిన తక్షణ సాయం రూ.10 వేలు మతుడి భార్య రజియాకు మున్సిపల్ ఛైర్ పర్సన్ చేతుల మీద అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సంక్షేమ కార్యదర్శి గంగాధర్, వైసిపి నాయకుడు షఫీ తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలు

అనంతపురం సిటీ : జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు సోమవారం ఏఆర్ అదనపు ఎస్పీ ఎహనుమంత ఆధ్వర్యంలో స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో 'రియల్ టైం ఈవెంట్స్ ఉచిత శిక్షణ కు నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఎత్తు, బరువు, ఛాతీ (పురుష అభ్యర్థులు) కొలిచారు. అనంతరం 100 మీటర్లు,1600 మీటర్లు, లాంగ్ జంప్ ఈవెంట్స్‌కు ఉచిత శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, రమేష్ నాయక్, పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర, మంజుల, సుమారు 300 మంది కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

కుక్కలబెడద అరికట్టాలని వినతి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడద అరికట్టాలని కోరుతూ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన చైల్డ్ లైన్ (1098) ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి కమిషనర్ శరత్‌చంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ బాలాజీ మాట్లాడుతూ గుత్తి, ఆర్ఎస్‌లలో దాదాపు 500 కుక్కలు, కోతులు ఉన్నాయని చెప్పారు. కుక్కలు, కోతుల వల్ల ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో ఇటీవల కుక్కలు దాడిచేయడం వల్ల నాలుగేళ్ల బాలుడు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలు, కోతులను నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ

పెద్దపప్పూరు : మండలంలోని పాఠశాలలలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఎంఇఒ శ్రీదేవి ఆధ్వర్యంలో ఉపకరణాలను పంపిణీ చేశారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం అందించిన ఉచిత చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, రోలేటర్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌టి బాల పెద్దక్క, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రథోత్సవంలో జాగ్రత్తలు చేపట్టాలి

ఆత్మకూరు : పంపనూరు గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలూ చేపట్టాలని సర్పంచి ఎడమల ఎర్రిస్వామి ఆయా శాఖల అధికారులను కోరారు. సోమవారం అధికారులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. భక్తులకు తాగునీరు, భోజనం వసతి, వైద్యం, విద్యుత్, రోడ్డు సమస్యలపై ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు చేశామని తెలిపారు. ఆత్మకూరు రెవెన్యూ, ఎంపిడిఒ అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యలపై స్పందించాలని కోరారు. కొత్త రోడ్డు నిర్మించాలని కోరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి-గుత్తి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి లకు మద్దతుగా గుత్తిలో సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, తహశీల్దార్, మునిసిపల్, ఎంపిడిఒ, ప్రయివేటు కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. పెద్దల సభలో ప్రజా సమస్యలను ప్రశ్నించే పటిమ ఉన్న వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంచి వ్యక్తి, విద్యాధికుడు, మాజీ ఉపాధ్యాయుడు అయిన పోతుల నాగరాజును, ఉపాధ్యాయ సమస్యల పై గతంలో అనేక ఉద్యమాలు చేసిన కత్తి నరసింహారెడ్డి లను గెలిపిస్తే వారు ప్రజావాణి వినిపిస్తారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, రైతు సంఘం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, నాయకులు రామచంద్రారెడ్డి, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్, మండల కార్యదర్శి గౌతమ్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్నీ తదితరులు పాల్గొన్నారు.



పాంప్లెట్స్ అందజేస్తున్న సిపిఎం నాయకులు



గుత్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ముఖహాజరును రద్దుచేయాలని నిరసన

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం రమేష్



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు విధించిన ముఖ హాజరు విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం రమేష్ డిమాండ్ చేశారు. ముఖ హాజరు విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులతో పాటు ఒప్పంద పారిశుధ్య కార్మికులకు కూడా ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడం సరైంది కాదన్నారు. ముఖ హాజరు విధానంతో రాష్ట్రవ్యాప్తంగా ఒప్పంద కార్మికుల్లో మునిసిపల్ పర్మినెంట్ కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. స్మార్ట్ ఫోన్లకు సంబంధించి నైపుణ్యం లేని కార్మికులు అత్యధిక సంఖ్యలో ఉన్నారన్నారు. చదువు కూడా అంతంత మాత్రమే ఉన్న వారిని స్వయంగా ఎఫ్ఆర్ఎస్ తీసి పంపిస్తే హాజరుపడుతుందని, హాజరు పడితేనే జీతాలు వస్తాయని వారిని భయపెట్టడం సరికాదన్నారు. సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు కె.నరసయ్య, తిమ్మప్ప, మల్లి, రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్యలో ఘనంగా సైన్స్ ఫెస్ట్

అనంతపురం : సైన్స్ డే సందర్భంగా స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పోను ఏజీఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ సాంకేతికంగా అత్యాధునిక జీవనం గడుపుతున్నామంటే అందుకు ప్రధాన భూమిక సైన్స్ అని కొనియాడారు. ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలని ఆకాంక్షించారు. శాస్త్రీయత మనలోని తాత్వికతను పెంచి పారదర్శకంగా జీవించమని బోధిస్తుందన్నారు. మూఢనమ్మకాలు లేకుండా చేసి జీవితమనే భూమికను సస్యశ్యామలం చేస్తుందన్నారు. సైన్స్ ఫెస్ట్ సందర్భంగా విద్యార్థులు 150కి పైగా నమూనాలు తయారుచేసి వివరించిన తీరు ఆకట్టుకుంది. అత్యంత ప్రతిభ చూపించి నమూనాలు తయారు చేసిన చిన్నారులకు ఏజీఎం సుబ్బారెడ్డి చేతుల మీదుగా బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. బాలికలు శాస్త్రీయ నృత్యాలు, గీతాలాపనతో పాఠశాల ఆవరణంలో పండుగ వాతావరణం నెలకొంది.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గుత్తి : గుత్తి మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాయలసీమ విమోచన సమితి జిల్లా కన్వీనర్ వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బసినేపల్లి గ్రామంలో రాయలసీమ విమోచన సమితి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీ సత్యసాయి, వైటిసి తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పైపులైను అధునీకరణ చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు కాశీరావు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, గురు శంకర్, కోటేశ్వరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పది' ఉత్తీర్ణత పెంచేందుకు నైట్‌విజిట్

ఎంఈవోలకు డీఈవో సాయిరాం ఆదేశం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రతి టీచర్, హెచ్ఎం, ఎంఈవో, డీవైఈవో విద్యార్థుల ఇళ్లకు రాత్రి పూట వెళ్లి విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారని ఆరా తీయాలని డిఇఒ సాయిరాం మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని సైన్స్ సెంటర్‌లో అనంతపురం డివిజన్ పరిధిలోని ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ త్వరలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయని, షెడ్యూల్ కూడా వచ్చిందన్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి కలెక్టర్ ఆధ్వర్యంలో అనంత సంకల్పం కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. రాత్రి పూట పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారా? లేదా? అని తెలుసుకోవడానికి ప్రతి టీచర్, హెచ్ఎం, ఎంఈవో, డీవైఈవో నైట్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులు మరింతగా చదువుకుంటారన్నారు. ఇంటి వద్ద సెల్‌ఫోన్, టీవీలు దూరంగా ఉంచి, విద్యార్థులకు చదువుకునే వాతావరణం కల్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించాలన్నారు. ట్యాబ్‌లను వినియోగిస్తున్నారా? లేదా? అని కూడా ఆరా తీయాలన్నారు. ఇటీవల తాను తనిఖీ చేసిన పాఠశాలల్లో పలు లోపాలను గుర్తించామన్నారు. విద్యార్థుల కోసం ప్రతి స్కూల్లో ఫిర్యాదు బాక్సు ఏర్పాటు చేయాలని, దానిని ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఓపెన్ చేసి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని స్కూళ్లలో టీసీలు తీసుకెళ్లిన పిల్లల పేర్లు ఇంకా తొలగించలేదని, అలాంటి పేర్లు వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వం రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి విద్యాశాఖ ద్వారా అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలపైన విద్యార్థులకు తెలియజేయాలన్నారు. పేరెంట్స్ కమిటీలు సరిగా నిర్వహించడం లేదని, అలాంటి స్కూళ్లను గుర్తించి హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీవైఈవోను ఆదేశించారు. తాత్కాలిక సర్దుబాటు టీచర్లు వెంటనే జాయిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు, డీవైఈవోను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి కాని స్కూల్స్ హెచ్ఎంలకు కూడా నోటీసులు జారీ చేయాలన్నారు. టీచర్లు, విద్యార్థులు బైజ్యూస్ ట్యాబులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి యూనిఫాంలో పాఠశాలకు వచ్చేలా టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు రెండో విడతపనులను ఇంజినీర్లు, ఎంపిపిలు, మహిళా పిఎస్, గ్రామ-వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తనిఖీలు చేసి ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేసి విద్యాశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మరిన్ని అంశాలపై డీఈవో సమీక్షించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో పద్మప్రియ, డిసిఇబి సెక్రెటరీ లోకేశ్వరరెడ్డి, ఏఎస్వో ఓబుళరెడ్డి, ఏపీవోలు మారుతి, నాగరాజు, సమగ్రశిక్ష ఏఎస్వో గురు మునికృష్ణ, ఏపీవో నారాయణస్వామి, ఏఎంవో హరిక్రిష్ణ, అసిస్టెంట్ సెక్టోరియల్స్ మాధవరెడ్డి, తిప్పేస్వామి, రవి, చంద్రమోహన్ రెడ్డి, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సాయిరాం

చేపల వినియోగం పెంచడమే ప్రభుత్వ ధ్యేయం

ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-ఉరవకొండ

చేపల వినియోగ క్రయవిక్రయాలు పెంచడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం విడపనకల్లు మండల కేంద్రంలోని వైకెపి కార్యాలయంలో ఏపీఎం ఆంజనేయులు, విలేజ్ ఫిషరీస్ అధికారి చిరంజీవి ఆధ్వర్యంలో చేపల వినియోగం క్రయ విక్రయాలపై వైకెపి సిబ్బంది సీసీలు, యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషరీస్ డెవలప్మెంట్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారతదేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక స్థానంలో ఉందన్నారు. అయితే చేపల వినియోగంలో మాత్రం చాలా వెనకబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపల విక్రయాదారులను గుర్తించడానికి వైకెపి అధికారులకు ప్రభుత్వం బాధ్యతను అప్పగించిందన్నారు. రాష్ట్రంలో చేపల వినియోగాన్ని పెంచడానికి గ్రామీణ ప్రాంతాల్లో చేపల వ్యాపారాల చిన్న దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. చేపల దుకాణాలకు సంబంధించి ప్రభుత్వం యూనిట్ కాస్ట్ రూ.లక్షగా నిర్ణయించిందన్నారు. ఈ దుకాణాలు ఏర్పాటు చేయాలనుకున్న వారు యూనిట్ కాస్టులో 10 శాతముతో వారి పరిధిలోని సహకార బ్యాంకులో వారి పేరుమీద ఖాతా తెరవాల్సి ఉంటుందన్నారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ, సామాజిక వర్గాల వారికి 60శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీతో వ్యాపారానికి సంబంధించిన వస్తు సమగ్రి ఇస్తామన్నారు. సబ్సిడీ పోగా మిగిలిన మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

డాక్టర్ నాగేంద్రకు కొలకలూరి పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంకు చెందిన డాక్టర్ నానీల నాగేంద్రకు 2023 సంవత్సరానికి గాను కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కిషన్ రావు చేతులు మీదుగా సోమవారం ప్రదానం చేశారు. ఎన్టీఆర్ కళా ప్రాంగణం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి హైదరాబాదులో నిర్వహించిన 2023 కొలకలూరి పురస్కారాల ప్రధాన సభకు ఆచార్య కొలకలూరి మధు జ్యోతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టి.కిషన్ రావు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా డాక్టర్ నానీల నాగేంద్రకు పురస్కారాన్ని ప్రధానం చేయడంతో పాటు రూ.5 వేలు నగదు మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి కె.శివారెడ్డి ప్రముఖ రచయిత్రి ఓల్గా బిఎస్.రాములు తదితరులు పాల్గొన్నారు. నాగేంద్రకు ఈ పురస్కారం రావడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, ఆచార్య జి.బాలసుబ్రమణ్యం తదితరులు అభినందించారు.

పాత్రికేయులకు మంతకల్ రెడ్డి క్షమాపణ

గుంతకల్లు : గుంతకల్లు పట్టణంలో ఈనెల 14వ తేదీన సంచలనం రేపిన జంట హత్యల విషయం పాఠకులకు విదితమే. ఐతే ఆ హత్యల్లో ప్రముఖ భూస్వామి జిపి.హేమకోటిరెడ్డి హత్యా వార్త కవరేజ్‌కి వెళ్లిన పాత్రికేయులను దుర్భాషలాడిన మృతుడి తమ్ముడు జిపి.నీలకంఠరెడ్డి కుమారుడు జిపి.మంతకల్‌రెడ్డిపై పాత్రికేయులు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయనను రెండవ పట్టణ సిఐ గణేష్ స్టేషన్‌కు పిలిపించగా ఆ సమయంలో విలేకరులను దురుసుగా మాట్లాడినది వాస్తవమే అన్నారు. ఐతే తాను వారిని విలేకరులుగా గుర్తించ లేకపోయానన్నారు. ప్రయివేటు వ్యక్తులు కూడా మొబైల్ ఫోన్లలో ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెడుతున్నందున వారే అనుకుని పొరపాటున మాట్లాడానని తెలిపారు. అందుకు తనను క్షమించాలని పాత్రికేయులకు కోరారు. పోలీసుల ఎదుట బహిరంగ క్షమాపణ కోరిన మంతకల్‌రెడ్డిని క్షమించాని సిఐ గణేష్ పాత్రికేయులను సముదాయించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ.. విధులు నిర్వహణలో ఉన్న పాత్రికేయులపై ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అయితే సహించేది లేదన్నారు. చట్టపరంగా ఎదుర్కొంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పూజారి శ్రీనివాసులు, బాపురం వెంకటేశ్వర్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అడ్డపల్లకి గ్రామోత్సవం

ఉరవకొండ : ఉరవకొండ పట్టణం గవిమఠం శ్రీ స్థిత చంద్రమౌళీశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అడ్డ పల్లకి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలోని వెలిగొండ రహదారిలో ఉన్న విడిది మఠంలో పీఠాధిపతికి గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, అర్చకులు ప్రత్యేక పాదపూజ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి శ్రీచెన్నబసవ రాజేంద్ర స్వాముల వారిని పల్లకిలో కూర్చోబెట్టి పురవీధుల గుండా మేళతాలాలు, సంప్రదాయ నృత్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్రానికి చెందిన కళాకారులు శివ అమ్మవారి తాండవాలు, వీరభద్ర వేషదారి నృత్యం అందరిని ఆకట్టుకుంది. డప్పు వాయిస్తూ కళాకారులు చేసిన నృత్యాలు చూపరులను కట్టిపడేసాయి. ఈ ఉత్సవంలో గవిమఠం గజలక్ష్మి (ఏనుగు) ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

జీడిపల్లి నిర్వాసితులను ఆదుకోవాలని వినతి

బెలుగుప్ప : జీడిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కారణంగా ముంపునకు గురై నష్టపోయిన నిర్వాసితులకు రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి చేశారు. సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంతపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ.. 2009 జీడిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కారణంగా తమ గ్రామం మొత్తం నీటి ఊట ఏర్పడిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.78.5 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు జీవో విడుదల చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం పేర్కొన్న ప్యాకేజీకి ఈసారి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో జీడిపల్లి గ్రామస్తులు బ్రహ్మయ్య, దుద్దేకుంట సూర్యనారాయణ, రామన్న, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

85వ ప్లీనరీలో ఎఐసిసి సభ్యులు శైలజానాథ్

శింగనమల : చత్తీస్‌ఘడ్ రాజధాని రాయపూర్‌లో 3వ రోజు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సదస్సులో ఏఐసిపి సభ్యులు శైలజానాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2024లో కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాగానే ఏపీకి విభజన హామీ చట్టంలో ఉన్నవన్నీ అమలుపరుస్తామని తెలియజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు దాదా గాంధీ, ఎఐసిసి కోఆర్డినేటర్ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు శంకర్, అనంతపూర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ ఛైర్మన్ రామ్‌చరణ్ యాదవ్, జిల్లా కార్యదర్శి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆత్మకూరు మండల కేంద్రంలోని కళ్యాణదుర్గం-అనంతపురం రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. బెలుగుప్ప మండలం రామసాగరం గ్రామానికి చెందిన నందకిషోర్‌రెడ్డి (32) అనంతపురంలో నివాసముంటున్నాడు. సోమవారం ఆయన రామసాగరంలోని తన తోట వద్దకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఆత్మకూరు గ్రామ సమీపంలో నందకిషోర్‌రెడ్డి ద్విచక్రవాహనం, మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నందకిషోర్‌ను 108 సాయంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రంగడు యాదవ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ దొంగ అరెస్ట్

ఒక మోటార్ సైకిల్, కత్తి, నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి చైతన్య

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

వరుస దారి దోపిడీలు చేస్తున్న కర్నాటక రాష్ట్రానికి చెందిన దొంగల ముఠాలోని ఓ దొంగను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి విఎన్‌కె.చైతన్య తెలిపారు. సోమవారం తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి వివరాలను వెల్లడించారు. రాబడిన సమాచారం మేరకు రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సిఐ చిన్న పెద్దయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ లు సిబ్బందితో కలిసి రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు సమీపంలో టిడ్కో ఇళ్ల సమీపంలో దాడులు నిర్వహించారు. అక్కడ వరుస నేరాలకు పాల్పడుతున్న కర్నాటక రాష్ట్రానికి చెందిన దొంగల ముఠాలోని ఓ దొంగను అరెస్టు చేశారు. అరెస్టు కాబడిన దొంగ కర్నాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా సింధనూరు తాలూకా అంబామత్ గ్రామానికి చెందిన గొల్లర్ రమేష్ అలియాస్ కిన్నర్ జోగిగా గుర్తించారు. నిందితుడి నుండి నేరాలకు ఉపయోగించే ఒక మోటార్ సైకిల్, కొడవలి, కత్తి, కొంత నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతనితో పాటు ఉన్న మరో ఇద్దరు తప్పించుకున్నారు. వీరు హైవేల మీద వెళ్లే లారీలను టార్గెట్ చేసుకుని లారీ డ్రైవర్లను తమ వద్దనున్న కత్తులతో బెదిరించి వారి వద్దనున్న డబ్బును దొంగిలిస్తారని తెలిపారు. ఇలాంటి కేసులు ఫిబ్రవరి నెలలో తాడిపత్రి మండలంలో కూడా చోటుసుకున్నాయన్నారు. తప్పించుకున్న మిగతా ఇద్దరు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు. త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని వెల్లడించారు.

పూడికతీత పనుల్లో కార్మికునికి గాయాలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

స్థానిక భవానీ నగర్‌లో డ్రెయినేజీ కాలువలో పూడికతీత పనులు చేస్తుండగా అదుపుతప్పి బండలు మున్సిపల్ కార్మికుని కాలు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన కార్మికున్ని సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొన్నేళ్లుగా కార్మికులు ప్రాణాలను పణంగాపెట్టి ప్రమాదకరమైన పనులను చేస్తూ నగర ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. అయితే కార్మికులకు మాత్రం పని భద్రత, ఆరోగ్య భద్రత సరిగా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు, మున్సిపల్ పాలకవర్గం కార్మికులకు పని భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని, రక్షణ పరికరాలు, పనిముట్లు సకాలంలో అందివ్వాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు మెరుగైన వైద్యం అందించేలా డాక్టర్లతో మాట్లాడి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఒక స్థలం... రెండు పట్టాలు..!

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో డబ్లింగ్ పట్టాల వివాదాలు పెచ్చుమీరుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇక్కడ ఇందిరమ్మ కాలనీ నిర్మించారు. గ్రామ పెత్తందార్ల అండతో రెవెన్యూ అధికారి పాత పట్టాలకు కొత్త పట్టాలు ఇస్తూ లబ్ధిదారుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే ఇంటిపై రెండు పట్టాలు ఇస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలంలో రెగ్యులర్ తహశీల్దారు లేనప్పటికి గతంలో పనిచేసిన ఎమ్మార్వో పేరు మీద కొందరికి పట్టాలు మంజూరు అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. డబ్లింగ్ పట్టాలు మంజూరు చేయడం వెనుక సదరు విఆర్ఒకు రూ.వేలల్లో ముడుపులు ముడుతున్నట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఒకే ఇంటికి రెండు పట్టాలు మంజూరు చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జెఎన్‌టియు బీ.ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ పరిధిలో నిర్వహించిన బి.ఫార్మసీ మూడవ సంవత్సరం రెగ్యులర్ సప్లిమెంటరీ ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆచార్య బి.చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. ఒకటవ సెమిస్టర్ (ఆర్ 19) రెగ్యులర్, సప్లిమెంటరీ పలితాలు, బి.ఫార్మసీ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్ 15) సప్లిమెంటరీ పలితాలు, ప్రీ పిహెచ్‌డి, ఎంఎస్, ఎంఫిల్ వింటర్ సెషన్ (ఆర్ 9, ఆర్ 18) పరీక్ష పలితాలు విడుదల చేశామని చెప్పారు. పరీక్ష ఫలితాల కోసం హెచ్‌టిటిపి//జెఎన్‌టియుఎరిజల్ట్స్.ఏసి.ఇన్‌ను సంప్రదించాలని తెలిపారు.

కాలవ శ్రీనివాసులును కలిసిన ఆకుల విజయ్‌కుమార్

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులుని అనంతపురంలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురూ కాసేపు మండల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అరాచక వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడుగా పనిచేసి తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. మీలాంటి యువత పార్టీకి మంచి బలాన్ని ఇస్తుందన్నారు. సమిష్టిగా పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని విజయ్‌కుమార్‌కు కాలువ సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు అధికార ప్రతినిధి తలారి తిప్పన్న, రాయవరం శ్రీరాములు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆందోళన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సిద్దరాంపురం గ్రామానికి వెళ్లేదారిలో కొండమీదరాయుడు కొలువుదీరిన దేవరకొండను చదును చేసి ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో పాటు అక్కడ రెవెన్యూ అధికారులు నాటిన బోర్డును తీసేసి ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఆక్రమించి ప్లాట్లు వేశారన్నారు. వాటిని అమ్మి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ప్లాట్లు అమ్మకుండా నిలుపుదల చేయాలని తహశీల్దారు మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దారు తమ సిబ్బందితో వెళ్లి ప్లాట్లలో పాతిన రాళ్లను తీసివేశారు. వాటిని తీసుకొచ్చి కార్యాలయం వద్ద వేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

1 నుంచి పశువ్యాధి నియంత్రణ పథకం ప్రారంభం

ప్రజాశక్తి-నార్పల

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని మార్చి 1వ తేది నుంచి ప్రారంభిచనున్నట్లు పశువైద్య అధికారి గోవిందరాజు తెలిపారు. ఈ పథకం ద్వారా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను మార్చి 31వ తేదీ వరకు వేస్తామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.